# బార్‌లో కాలం చెల్లిన చేప మాంసం

- ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..
- యజమానికి నోటీసులు జారీ



కాలం చెల్లిన ఫ్రోజెన్ చేప మాంసం

పోచమ్మమైదాన్, ఆగస్టు 1: వరంగల్ ఎంజీ రోడ్డులోని శ్రావణి బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్‌లో ఉన్న తినుబండారాలను పరిశీలించారు. దీంతో కాలం చెల్లిన ఫ్రోజెన్ చేప మాంసాన్ని గుర్తించారు. బార్‌లో సరైన ఆరోగ్య ప్రమాణాలు పాటించడం లేదని యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

# కంపుకొడుతున్న మార్చురీ

- ఎంజీఎంలో ఫ్రీజర్లు పనిచేయక కుళ్లుతున్న శవాలు
- దుర్గంధంతో ఊపిరి తీసుకోలేని పరిస్థితి
- మరమ్మతులను పట్టించుకోని అధికారులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 1 : వరంగల్ ఎంజీఎం మార్చురీ కంపు కొడుతోంది. శవాలను భద్రపరిచే డీప్ ఫ్రీజర్లు పని చేయకపోవడంతో అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో అక్కడికి వెళ్లిన ప్రజలు ఊపిరి తీసుకోవడం సైతం ఇబ్బందికరంగా ఉంటున్నది. మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు సైతం క్షణం కూడా నిల్చోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు, అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వారి శవాలు పాడైపోయిన స్థితిలో పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తున్నది. ఈ కారణం వల్ల రిపోర్టులు సైతం మారిపోయే అవకాశాలు లేకపోలేదని వైద్యులు అంటున్నారు. నిబంధనల ప్రకారం గుర్తు తెలియని శవాలను కనీసం మూడు రోజుల పాటు భద్రపరచాలి. అనంతరం ప్రభుత్వ అధికారుల సమక్షంలో పంచనామా చేసి ఆ పిదప పోస్టుమార్టం నిర్వహించి, శవాన్ని ఖననం చేయాల్సి ఉంటుంది. ఫ్రీజర్లు పనిచేయని కారణంగా గుర్తు తెలియని శవాల పరిస్థితి అధ్వానంగా తయారవుతున్నది. ఎంజీఎం మార్చురీలో అందుబాటులో ఉన్న ఏడు ఫ్రీజర్లు పని చేయకపోవడంతో తాత్కాలికంగా ఫ్యాన్లు ఏర్పాటు చేసి నెట్టుకువస్తున్నారు. చాలాకాలంగా వీటికి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కార మార్గాలు చేపట్టకపోవడంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. అంత్యక్రియలను సైతం కుటుంబసభ్యులు ముక్కులు మూసుకొని నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు మార్చురీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలను చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంజీఎం మార్చురీలో పనిచేయని డీప్ ఫ్రీజర్లు




















